క్లుప్తంగా

విద్యార్థులు ప్రతి రంగంలో రాణించాలి


విజేతలను అభినందిస్తున్న శ్రీనివాస్ తదితరులు

పెద్దాపురం: ప్రతి విద్యార్థి చదువుతో పాటు, అన్ని రంగాల్లో రాణించాలని పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీసీసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం జానపద నృత్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షురాలు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బుద్దా శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థుల్లో దాగున్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి వివిధ రంగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రొంగల అరుణ్‌కుమార్, కె.పవన్‌కుమార్, ఎ.ధర్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన

పెద్దాపురం: ప్రతి ఒక్కరిలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విజ్ఞాన విహార యాత్ర పేరిట వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్టు కాండ్రకోట హైస్కూల్ హెచ్‌ఎం ఎంఎస్‌సీ మూర్తి తెలిపారు. బుధవారం జిల్లా ఆత్మ, మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం కృషి ఉద్యాన కేంద్రాన్ని విద్యార్థులు సందర్శించారు. అక్కడున్న పట్టు పురుగుల పెంపకం, చేపల పెంపకం, ఉద్యాన పంటలు, కోళ్ల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల విజ్ఞాన యాత్రకు సహకరించిన ఆత్మ, శాంతవర్ధన సంస్థకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా కార్తిక వన సమారాధన

సామర్లకోట: పిఠాపురం రోడ్డులోని ఉప్పువారి సత్రం ఆవరణలో బుధవారం ఉత్సాహంగా కార్తిక వన సమారాధన నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి పిఠాపురం రోడ్డు వన సమారాధనకు వెళ్లిన భక్తులతో నిండిపోయింది. సత్రం వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పు సత్యనారాయణ కుటుంబ సభ్యులు సత్రం ఆవరణలో ఉన్న రావి, ఉసిరి చెట్టుకు, పూర్వీకుల చిత్రపటాలకు పూజలు చేశారు. సుమారు పది వేల మందితో కార్తిక వన సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, పలువురు కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పారిశ్రామిక వేత్తలు, ప్రముఖులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

కీలక కసరత్తు

- ముసాయిదా ఓటరు జాబితా రెడీ
- నియోజకవర్గంలో మొత్తం 2,14,933 మంది
- తాజా గణాంకాల్లో తగ్గిన సంఖ్య
- ఈ నెల 28 వరకు అభ్యంతరాల స్వీకరణ
- రెండు రోజుల పాటు ప్రత్యేక క్యాంపెయిన్


ముసాయిదా ఓటర్ల జాబితాను చూపుతున్న అసిస్టెంట్ ఏఆర్వో వెంకటలక్ష్మి



పెద్దాపురం: ఓటరు ముసాయిదా జాబితాను పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి అధికారులు ప్రచురించారు. ఓటర్ల జాబితాను నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రకటించనున్నట్లు తెలిపారు. ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితా ఏఆర్వో, పోలింగ్ కేంద్రాలు, బూత్ లెవెల్ అధికారుల వద్ద అందుబాటులో ఉంటాయి. ఈ నెల 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఈ నెలలో 23, 24 తేదీలలో ఓటరు నమోదు, అభ్యంతరాల స్వీకరణకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తారు. వచ్చే ఏడాది జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించేందుకు చర్యలు చేపడుతున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలు

ఓటరు నమోదుకు కళాశాలలు, గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. డిసెంబర్ 24వ తేదీలోపు క్లెయిమ్‌లను, అభ్యంతరాలను పరిష్కరించనున్నట్టు అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ వెంకటలక్ష్మి వెల్లడించారు.

201 పోలింగ్ కేంద్రాల్లో...

నియోజకవర్గంలోని రెండు అర్బన్లు, రెండు మండలాల్లో మొత్తం 201 పోలింగ్ కేంద్రాలున్నట్లు అసిస్టెంట్ ఏఆర్వో, తహసీల్దార్ వెంకటలక్ష్మి చెప్పారు. నియోజకవర్గంలో ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం, 2,14,933 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 1,05,661, మహిళలు 1,09,259, ఇతరులు 13 మంది ఉన్నారు. వాస్తవానికి నియోజకవర్గంలో పాత జాబితా ప్రకారం 2,15,095 మంది ఓటర్లుండాలి. అయితే కొత్త ముసాయిదాలో మరణించిన, ఇతర కారణాలతో తొలగించిన ఓటర్లతో ఈ సంఖ్య తగ్గింది. ప్రస్తుత గణాంకాల ప్రకారం 162 మంది ఓటర్లు తగ్గారు. మండలాల వారీగా నియోజకవర్గ తాజా ముసాయిదా మేరకు ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
పెద్దాపురం అర్బన్	19,734	21,537	6	41, 277
సామర్లకోట అర్బన్	21,098	22506	2	43606
పెద్దాపురం రూరల్	30,130	29919	2	60,051
సామర్లకోట రూరల్	34,826	35332	3	70,161

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పోస్టర్లు ఆవిష్కరించిన కమిషనర్

సామర్లకోట: దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏడాది నవంబర్ 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను గ్రంథాలయాధికారి బందిల రత్నమణి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తన చాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ, ఈ వారోత్సవాలను విద్యార్థులు విజయవంతం చేయాలన్నా రు. గ్రంథాలయాలలో ఉన్న విలువైన పుస్తకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. రత్నమణి మాట్లాడుతూ, గురువారం బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శనతో పాటు, ఈ నెల 20 వరకు పుస్తక పఠనం ప్రాధాన్యాన్ని వివరిస్తారన్నారు. 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న వారిని స్మరించుకుంటూ.. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, కవి సమ్మేళనాలు, 17న విద్యార్థులకు చిత్రలేఖనం, 18న వక్తృత్వ, క్విజ్ పోటీలు, 19న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దిశ చట్టం, మహిళా సాధికారతపై చర్చ, 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, సామూహిక పుస్తక పఠనంతో గ్రంథాలయ వారోత్సవాలు ముగుస్తాయని వివరించారు.

కల్యాణం.. కమనీయం

- కన్నులపండువగా వేణుగోపాలస్వామి కల్యాణం
- భారీగా తరలివచ్చిన భక్తులు


పిఠాపురంలో కల్యాణ అలంకరణలో వేణుగోపాలస్వామి, అమ్మవార్లు


కొమరగిరిలో స్వామి, అమ్మవార్లు

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత స్వామి, అమ్మవార్లకు కల్యాణ అలంకరణ గావించారు. పండితులు సుదర్శనం మాధవ మణికంఠచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి ఆలయం వద్ద వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ నున్న శ్రీరాములు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు విజయ జనార్దనాచార్యులు, వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధి సేవాసమితి ప్రెసిడెంట్ చెరుకుపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ మోహన్, సభ్యులు మల్యాల గోపాలకృష్ణ, అప్పలరాజు, లక్ష్మీ ప్రియాంక, దేవస్థానం సిబ్బంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై గ్రామోత్సవం

పిఠాపురంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి ఉత్సవ విగ్రహాలను శేష వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి పెద్ద బజారు, కోటగుమ్మం సెంటర్, సినిమా సెంటర్ మీదుగా ఈ గ్రామోత్సవం సాగింది. దారి పొడవునా భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ నున్న శ్రీరాములు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా విశ్వేశ్వరస్వామి కల్యాణం

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరిలో వేంచేసిన అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పిఠాపురం మహారాజు తరఫున దేవస్థానం వంశపారంపర్య ట్రస్ట్ సభ్యుడు కొండమంచిలి కృష్ణ పట్టు వస్త్రాలు సమర్పించారు. తొలుత పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం, ధ్వజారోహణ నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గురువారం స్వామివారికి విశేష పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు, 15న కార్తిక పౌర్ణమి సందర్భంగా త్రిశూలస్నానం, స్వామివారికి అభిషేకం, అమ్మవారికి వారికి కుంకుమార్చన, గ్రామోత్సవం, తెప్పోత్సవం, జ్వాలాతోరణం నిర్వహించనున్నట్లు తెలిపారు. 16న స్వామివారికి పంచామృతాభిషేకం, 17న లక్షపత్రి పూజ, శ్రీపుష్ప యాగంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ అర్చకులు తెలిపారు.

నెహ్రూ జయంతితో మ్యాజిక్ చదరం

14	11	20	24
25	19	8	17
9	16	26	18
21	23	15	10

మ్యాజిక్ చదరం


తోటకూర సాయిరామకృష్ణ

సామర్లకోట: దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 135వ జయంతిని 2024, నవంబర్ 14న జరుపుకొంటారు. గురువారం జరిగే ఈ జయంతి తేదీతో స్థానిక గణితావధాని తోటకూర సాయి రామకృష్ణ మ్యాజిక్ చదరం తయారు చేశారు. 14–11–2024ను తొలి వరుసలో వేసి, దానిని కలుపుగా 69 రావడంతో.. ఏ నాలుగు అంకెలు కూడినా 69 వచ్చే విధంగా మ్యాజిక్ చదరాన్ని రూపొందించారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంబాబు

పిఠాపురం: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగంలోని కార్మికుల హక్కులను ప్రభుత్వం నీరు గార్చే ప్రయత్నాలు చేస్తోందని 104 ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు విమర్శించారు. 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం పిఠాపురం మండలం నర్సింగపురంలో భారతరత్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 104 సేవలను ప్రభుత్వమే నిర్వహించడం వలన ప్రజాధనం వృథా కాదన్నారు. 13 రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించి 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో 104 డ్రైవర్‌లు రాఘవ, సంతోష్, డీఈఓ దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుని ఆలయంలో చండీ హోమం


రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న చండీ హోమం

సామర్లకోట: పట్టణంలోని ఐదు తూముల వద్ద ఉన్న అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి చండీ హోమం నిర్వహించారు. కార్తిక మాసం క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ ధర్మకర్త పరమానందగిరి స్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

ప్రజలపై భారాలు మోపుతున్న పాలకులు


ప్రజాపోరు నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: అన్ని విధాలా ప్రజలను ఆదుకుంటామని అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం వారిపై మోయలేని భారాలు వేస్తోందని సీపీఎం నాయకులు విమర్శించారు. ప్రజాపోరులో భాగంగా బుధవారం స్థానిక మెయిన్ రోడ్డులో పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు నీలపాల సూరిబాబు మాట్లాడుతూ, ఇసుక ఉచితమని ప్రకటించి అత్యంత ఎక్కువ ధరకు అమ్ముతున్నారని దుయ్యబట్టారు. భవన నిర్మాణ రంగంపై ఆధారపడ్డ వారిని రోడ్డున పడేసిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణలోనూ కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. పట్టణంలో వంద పడకల ఆస్పత్రిని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిపురపు శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణ, నెక్కల నరసింహమూర్తి, అప్పన్న పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు


కాపవరంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

సామర్లకోట: రైతుల భూ సమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ అవగాహన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కొప్పూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. బుధవారం కాపవరం పంచాయతీలో జరిగిన రీ సర్వే అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. రైతుల దస్తావేజుల్లోను, వారి భూమి మరొకరికి రికార్డు అయితే రీ సర్వేలో మార్పు చేసుకోవచ్చన్నారు. భూముల వాస్తవ పరిస్థితులపై ప్రతి రైతు సహకరించాల్సి ఉంటుందన్నారు. ఈ గ్రామ సభలో 36 అర్జీలు వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంచం మాధవరావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై శ్రీనివాసు, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు సృజనదేవి, దినేష్ మోషేరాజు, వీఆర్వోలు జి.నాగేశ్వరరావు, వై ముసలయ్య, చంద్రబాబు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం: విద్యుత్ లైన్ల మరమ్మతులు, వైర్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రభాకర్ బుధవారం తెలిపారు. పిఠాపురం పట్టణంలోని జగ్గయ్య చెరువు, వైభవ్ వెంచర్, క్రిష్ లే అవుట్, గవర్నమెంట్ జనరల్ హాస్పటల్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, మాధవస్వామి గుడి ఏరియా, అంబేడ్కర్ సెంటర్, రథాల పేట, వస్తాది వీధి, కోటవారి వీధి, విశ్వం గారి లే అవుట్, జడ్జి గారి క్వార్టర్స్, గోపాల్ బాబా ఆశ్రమం, బ్రాహ్మణ లేఅవుట్, చంద్రంపాలెం తదితర ఏరియాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పిఠాపురం మండలంలో..

పిఠాపురం మండలంలోని పి.దొంతమూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రభాకర్ తెలిపారు. పి.దొంతమూరు, వెల్దుర్తి, బి.కొత్తూరు, జగపతిరాజపురం తదితర గ్రామాలు, సబ్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ బోర్లకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొత్తపల్లి మండలంలో...

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏవీఎస్ఎస్ ప్రభాకరావు బుధవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని మూలపేట, అమరవిల్లి, రామన్నపాలెం, శీలంవారిపాలెం, పొన్నాడ గ్రామాలతో పాటు అమరవల్లి రొయ్యల చెరువులు, పొన్నాడ రొయ్యల చెరువులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు వైద్య శిబిరం

సామర్లకోట: ప్రపంచ మధుమేహ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక క్లబ్ భవనంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు క్లబ్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో సుగర్, బీపీ పరీక్షలు చేయడంతో పాటు, సుగర్ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహిస్తారన్నారు. క్లబ్ సభ్యుడు డాక్టర్ ఎస్ మహోన్నత్ వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉప్పాడలో రీ సర్వే గ్రామసభ

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ గ్రామ సచివాలయం వద్ద బుధవారం తహసీల్దార్ చిన్నారావు ఆధ్వర్యంలో రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. భూముల రీ సర్వేలో నెలకొన్న సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామసభలో 4 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. గురువారం సుబ్బంపేట, 16న గోర్సలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

సారా స్థావరాలపై దాడులు

కొత్తపల్లి: పొన్నాడ శివారులో సారా స్థావరాలపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 50 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల సారా, సారా తయారీ సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై వెంకటేష్ తెలిపారు. సారా తయారు చేస్తున్న వాసంశెట్టి అప్పన్నను అరెస్టు పిఠాపురం కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు చెప్పారు.

బీచ్ రోడ్డులో రాకపోకలు నిలిపివేత


ఉప్పాడ బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిపివేసిన పోలీసులు

కొత్తపల్లి: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సముద్ర తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. కెరటాల ఉధృతి తీవ్రంగా ఉండడంతో బుధవారం రాత్రి ఉప్పాడ–కాకినాడ బీచ్ రోడ్డులో రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. బీచ్ రోడ్డు మీదుగా వెళ్లే వాహనాలను ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్ నుంచి పిఠాపురం వైపుగా మళ్లిస్తున్నారు. అలలు ఉధృతికి బీచ్ రోడ్డు కోతకు గురవుతోంది. బీచ్ రోడ్డులో వెళ్లే ప్రయాణికులు తమ రాకపోకలను మార్చుకోవాలని పోలీసులు హెచ్చరించారు. ఉప్పాడ, నేమాం వద్ద పోలీసులు రాకపోకలను నిలిపివేశారు.

పంచారామ క్షేత్రంలో క్షీరాబ్ది ద్వాదశి పూజలు

సామర్లకోట: పవిత్ర పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం క్షీరాబ్ది ద్వాదశి పూజలు నిర్వహించారు. ఆలయంలో గోపూజ తరువాత స్వామివారికి తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి భక్తులు తరలివచ్చారు. ఉచిత దర్శనంతో పాటు, రూ.20, రూ.50, రూ.100 క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయంలోని ధ్వజ స్తంభం, జమ్మి చెట్టు, తులసీ మొక్క, మారేడు చెట్టుతో పాటు, ఆలయం అంతా దీపాలతో నిండిపోయింది. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజగోపాల్ శర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు అంజిబాబు, భాస్కర్, కుమార్ స్వామి వారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు, భక్త కమిటీ సభ్యులు తలుపుల అంజనీ కుమార్, చల్లా సత్తిబాబు, బీవీ రమణలు భక్తులకు సేవలందించారు. సాయంత్రం స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సీఐ ఎ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. వేట్లపాలెం పీహెచ్‌సీ డాక్టర్ వై శ్రీహిమవతి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఐదు తూముల వద్ద ఉన్న అన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలోను, పాత సామర్లకోటలోని బాలా త్రిపుర సుందరి సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలోను, మఠం సెంటర్‌లోని చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

పంచాయతీ కార్యదర్శులకు నేడు జీపీడీపీపై శిక్షణ

సామర్లకోట: గ్రామాభివృద్ధి ప్రణాళికల తయారీపై మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఒక రోజు శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి, ప్రణాళికలు రూపొందించడంపై శిక్షణ ఉంటుందన్నారు. పంచాయతీల్లో తయారు చేసిన ప్రణాళికల ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. పంచాయతీ పరిధిలో గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 కార్యదర్శులు, పంచాయతీరాజ్ ఏఈ, మండల పరిషత్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఉపాధి హామీ ఏఈఓ, పశు సంవర్థక శాఖ అధికారులు, పీహెచ్‌సీ డాక్టర్, ఐసీడీఎస్, వ్యవసాయ శాఖ అధికారులు, మహిళా సంఘాల అధ్యక్షులు తప్పనిసరిగా ఈ శిక్షణకు హాజరు కావాలన్నారు.

అలరించిన జ్యోతిర్లింగార్చన


పంచారామ క్షేత్రంలో జరిగిన జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చనను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. కార్తిక మాసం సందర్భంగా ఆలయంలో లక్షపత్రి పూజలు చేసుకునే భక్తులకు దేవస్థానం ఆలయ దీపారాధన సంఘం ద్వారా జ్యోతిర్లింగార్చనకు అవకాశం కల్పిస్తారు. క్షీరాబ్ది ద్వాదశి కావడంతో ప్రత్యేకంగా జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. దాంతో లక్షపత్రి పూజలు చేసిన భక్తులు జ్యోతిర్లింగార్చనకు పూజలు చేసి, దీపాలు వెలిగించారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ధ్వజ స్తంభం వద్ద పూజలు చేసి, ఆకాశదీపం వెలిగించారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు

పిఠాపురం: పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పిఠాపురం సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. పట్టణంలో బుధవారం రాత్రి పోలీసు సిబ్బంది విజువల్ పోలిసింగ్ నిర్వహించారు. పట్టణంలోని ఉప్పాడ సెంటర్ నుంచి కోటగుమ్మం సెంటర్, మార్కెట్, మున్సిపల్ కార్యాలయం, చర్చి సెంటర్ వరకూ ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. వ్యాపారులు ఎవరైనా సరే తమ దుకాణాల వద్ద ఫుట్‌పాత్‌లను ఆక్రమించకుండా చూసుకోవాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అందరు సహకరించాలని ఆయన కోరారు.

భక్తిభావాన్ని పెంచుకోవాలి

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంచుకోవాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత అన్నారు. మండలంలోని యండపల్లిలో పార్టీ నేత, గురుస్వామి జ్యోతుల చక్రబ్బాయి అయ్యప్ప మాలధారులకు బుధవారం భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వంగా గీత పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు పాల్గొన్నారు.